సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



బీసీలు ఉద్యమించాలి
హక్కుల సాధన కోసం బీసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. - 8లో



ఎదురుచూపులు ఫలించేనా..!
పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ (ఏడీఈ)లలో ఆశలు చిగురించాయి. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం $34^0/22^0$
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కాస్త ఉక్కపోతగా ఉండి, రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆడిట్ అధికారుల తనిఖీ
కాజీపేట అర్బన్: వరంగల్ రీజినల్ ఆఫీస్ (ఆర్ఓ) రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి చెందిన ఆడిటింగ్ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. కార్యాలయానికి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కేటాయించే బడ్జెట్ వినియోగంపై అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని పలు రికార్డులను తనిఖీ చేసినట్లు సమాచారం. కాగా, ఆడిట్ తనిఖీ బుధవారం సైతం కొనసాగనుంది.

17వరకు ఎంసీఏ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ (సీబీసీఎస్) మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు ఈ నెల 17వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక మంగళవారం తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అన్ని పేపర్లకు రెగ్యులర్‌కు రూ.1.050, బ్యాక్‌లాగ్స్ రెండు పేపర్లకంటే ఎక్కువ ఉంటే రూ.950, బ్యాక్‌లాగ్ రెండు పేపర్ల వరకు రూ.500, ఇంప్రూవ్‌మెంట్ ప్రతి పేపర్‌కు రూ. 300 చొప్పున ఫీజు చెల్లించాల్సింటుందని వివరించారు.

బీటెక్ పరీక్ష కేంద్రం పరిశీలన
కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న బీటెక్ పరీక్ష కేంద్రాన్ని వీసీ తాటికొండ రమేష్ మంగళవారం సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఆయన వెంట రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సదానందం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఉన్నారు.

వ్యాగన్‌షెడ్ వద్ద రైతుల నిరసన



కాజీపేట రూరల్ : కాజీపేట మండలం 45వ డివిజన్ అయోధ్యపురం-మడికొండ శివారు గ్రామాల మధ్య చేపట్టిన రైల్వే వ్యాగన్‌షెడ్ నిర్మాణ పనుల వద్ద మంగళవారం అయోధ్యపురం గ్రామ రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యాగన్ షెడ్ పరిశ్రమ కోసం తమ వ్యవసాయ భూములను తీసుకున్న ప్రభుత్వం ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని అన్నారు. రెండు సంవత్సరాల నుంచి హనుమకొండ ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరిగిన పరిహారం రాలేదని ఆరోపించారు. తమకు నష్టపరిహారం ఇచ్చే వరకు వ్యాగన్ పరిశ్రమ పనులు ఆపాలని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, కలెక్టర్, ఆర్డీఓ స్పందించి తమకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చూడాలని, లేనిపక్షంలో వ్యాగన్ పరిశ్రమ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా
వరంగల్ అర్బన్ : నగరంలో అక్రమ నిర్మాణాలను గ్రేటర్ అధికారులు కూల్చివేస్తున్నారు. 39వ డివిజన్‌లోని ఏకశిలానగర్, శివనగర్ ప్రాంతాల్లో మంగళవారం అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అనధికారికంగా స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు ఆ నిర్మాణాలను తొలగిస్తామని సిటీ ప్లానర్ వెంకన్న తెలిపారు. బల్దియా ఏసీపీ సుష్మ, పట్టణ ప్రణాళిక అధికారులు, పోలీసు అధికారులు, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
హన్మకొండ అర్బన్ : ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మైమూదా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేసి ఆమె మాట్లాడారు. ఆశ వర్కర్లకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని, రూ.18 వేలకు వేతనం పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి రాజనర్సింహ రెండు రోజుల్లో జీతాలు వేస్తామని, మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వేతనాల పెంపు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కూర వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, నిర్మల, రషీదా, నజ్మా, యాదమ్మ, సల్మా, జాకిర, రాణి, కల్పన పాల్గొన్నారు.

తుదిదశకు చేరిన బదిలీల కసరత్తు
- పోస్టింగ్‌లపై ఫలిస్తున్న పైరవీలు
- పోలీసుశాఖలో త్వరలోనే ఉత్తర్వులు..
- 'రెవెన్యూ'లోనూ బదిలీల హడావుడి
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో తప్పనిసరైన బదిలీలు
- పలువురు సీఐలు, ఏసీపీలకు త్వరలోనే స్థాన చలనం
- ఎన్నికల ముగిసే వరకు కదలకుండా ఉండేందుకూ పైరవీలు
- పోలీస్‌శాఖలో హాట్‌టాపిక్‌గా బదిలీలు, పోస్టింగ్‌లు



'గ్రేటర్' ఠాణాల పైనే అందరి గురి!

సాక్షిప్రతినిధి, వరంగల్:

బదిలీలు, పోస్టింగ్‌ల వ్యవహారం పోలీస్‌శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లు పూర్తయిన, స్థానిక అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీస్, రెవెన్యూశాఖల్లో బదిలీలకు చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా హైదరాబాద్‌లో ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించి మార్గదర్శకాలను సూచించారు. ఇతర శాఖల్లోనూ బదిలీలు చేయాల్సి ఉన్నా.. ప్రస్తుతం పోలీస్‌శాఖలో మాత్రం బదిలీల సందడి జోరందుకుంది. బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియ మొదలైందే తడవుగా కోరుకున్న ఠాణాల్లో పోస్టింగ్‌లు కొట్టేందుకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో లాబీయింగ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వారే ఈ ప్రభుత్వంలోనూ పట్టు సాధించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పోస్టింగ్‌ల కోసం చేస్తున్న పోటాపోటీ ప్రయత్నాలు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి.

గ్రేటర్ వరంగల్ ఠాణాలపైనే అందరి గురి..
ఒకప్పుడు ఉమ్మడి వరంగల్‌లో పనిచేసిన సీఐలు కమిషనరేట్‌లో పోస్టింగ్‌ల కోసం పోటీపడే పరిస్థితి ఉండేది. ప్రభుత్వం మారడంతో ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు సన్నిహితులై ఉమ్మడి వరంగల్‌తోపాటు కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పనిచేస్తున్న వారు గ్రేటర్ వరంగల్ ఠాణాలపై గురిపెట్టారు. హనుమకొండ, కేయూసీ, హసన్‌పర్తి, సుబేదారి, కాజీపేట, మడికొండ, హసన్‌పర్తి, మట్టెవాడ.. నగరం చుట్టూ ఉన్న ధర్మసాగర్, ఆత్మకూరు, గీసుకొండ, వర్ధన్నపేట, ఎల్కతుర్తి తదితర ఠాణాల పోస్టింగ్‌లు పట్టేందుకు పోటాపోటీగా ఇన్‌స్పెక్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. హనుమకొండ, కాజీపేట, వరంగల్, వర్ధన్నపేట, జనగామ ఏసీపీ పోస్టింగ్‌లపై ఆశావహుల పైరవీలు చీఫ్ ఆఫీస్‌ను తాకుతున్నట్లు ప్రచారం ఉంది. హైదరాబాద్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులతో ఒత్తిడి చేయిస్తున్నట్లు చెబుతున్నారు. స్థానిక నేతలతో వారి అనుయాయుల ద్వారా మంతనాలు జరుపుతున్న కొందరు ఇన్‌స్పెక్టర్లు.. ఇక్కడ పనిచేసి హైదరాబాద్ స్థాయిలో ఉన్న సీనియర్ అధికారుల ద్వారా ఒత్తిడి చేస్తుండటం ఆ శాఖలో చర్చనీయాంశగా మారాయి.

లేఖలు లేవు, నోటి మాటలే...
కోరుకున్న చోట కొలువు చేయాలనుకునే కొందరు సీఐలు.. కీలక ఠాణాల్లో ఖర్చీఫ్‌లు వేసుకునే ప్రయత్నంలో పడరాని పాట్లు పడుతున్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం లేఖల పద్ధతికి స్వస్తిపలికినా.. ఠాణాల పరిధిలోని ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులను కలిసి సిఫార్సు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ) పదవీకాలం ఏడాదైన పూర్తికాకముందే ఆ పోస్టింగ్ కొట్టేందుకు సిద్ధపడుతున్నారు. హనుమకొండ - కరీంనగర్ రోడ్డుపై ఉన్న మూడు ఠాణాలకు దాదాపుగా ఖరారైనట్లేనని, ఉత్తర్వులు వెలువడడమే తరువాయిగా చెబుతున్నారు. ఈ ఠాణాల్లో పరకాల సబ్ డివిజన్ నుంచి ఒకరు, ఖమ్మం నుంచి ఒకరు, కమిషనరేట్‌లో లూప్‌లైన్‌లో ఒకరికి ఖాయమైనట్లు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతోంది. లూప్‌లైన్ మరో ఇద్దరు సీఐల్లో ఒకరు పరకాల సబ్‌డివిజన్‌లో ఠాణాను ఖాయం చేసుకోగా, మరొకరు జనగామ జిల్లా కేంద్రంలోని ఠాణా కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించనట్లు తెలిసింది. కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పనిచేస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు కమిషనరేట్‌లో ఎంట్రీకి చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. హనుమకొండ, కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ఠాణాలను ఆశిస్తున్నట్లు ప్రచారం. ఈ ఠాణాల్లో ఉన్న ఇద్దరిలో ఒకరు వరంగల్, మరొకరు వర్ధన్నపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఠాణాల్లో పోస్టింగ్‌లు పట్టే పనిలో ఉన్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని కీలక ఠాణాల కోసం పోటాపోటీగా చేస్తున్న ప్రయత్నాల్లో చివరి నిమిషంలో ఎవరెవరు ఏయే ఠాణాలు దక్కించుకుంటారనే చర్చ పోలీస్‌వర్గాల్లో సాగుతోంది. మరో 15 రోజుల్లో మేడారం మహాజాతర జరగనున్న నేపథ్యంలో తాత్కాలికంగా బదిలీలు, పోస్టింగ్‌లకు బ్రేక్ వేస్తారా? లేదంటే ఆలోపే ప్రక్రియ పూర్తి చేస్తారా? అన్న చర్చ కూడా జరుగుతోంది.


'గుడిమెలిగె'కు సిద్ధం

- నేటి నుంచే మహాజాతర పూజా కార్యక్రమాలు
- మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ ఆలయాలు శుద్ధి
- ప్రత్యేక పూజలు నిర్వహించనున్న పూజారులు

మేడారం ముచ్చట్లు



మేడారంలోని సమ్మక్క గుడి



కన్నెపల్లిలోని సారలమ్మ గుడి

ఎస్ఎస్ తాడ్వాయి: తెలంగాణ కుంభమేళా, మేడారం మహాజాతరలో తొలి కార్యక్రమమైన గుడిమెలిగె పండుగ నేడు(బుధవారం) జరగనుంది. ఇందులో భాగంగా పూజారులు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ ఆలయాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ పండుగతో మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతర తొలిపూజ ప్రారంభం కానుంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే మహాజాతరకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఇంతటి ప్రసిద్ధి పొందిన ఈ జాతర ప్రారంభానికి నాంది గుడిమెలిగె పండుగ. ఒక్కప్పుడు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారమ్మలకు గుళ్లగా గుడిసెలు ఉండేవి. జాతర ముందు ఈ గుడిసెలకు మరమ్మతులు చేసేవారు. గుడిసెలకు కొత్తగా పైకప్పు అమర్చడం (కప్పడం) చేసేవారు. దీన్నే గుడి మెలగడం అంటారు. ఈ ప్రక్రియతోనే జాతర తొలిపూజ కార్యక్రమాలు మొదలయ్యేవి. ఇప్పుడు గుడిసెలు లేవు. వీటి స్థానంలో భవనాలు కట్టారు. గుడిసెలు లేకున్నా.. జాతరకు రెండు వారాల ముందు గుడిమెలిగె కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

14న మండమెలిగె..
జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు 14వ తేదీన దేవతలు ఉండే ఆవరణలను శుద్ధి చేసి ముగ్గులు వేసి అలంకరిస్తారు. దీన్ని మండ మెలిగె పండుగ అంటారు. గుడి, మండ మెలిగె కార్యక్రమాలు తల్లుల వారంగా భావించే బుధవారాల్లోనే జరుగుతాయి. ఇదే రోజున సమ్మక్క వారంగా భావించి భక్తులు తమ ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. గుడి మెలిగె పూజ కార్యక్రమం ముగిసేంత వరకు వనదేవతల పూజారులు ఉపవాసం ఉంటారు.

మేడారంలో సమ్మక్క పూజారులు, వడ్డెలు..
మేడారంలోని పూజారులు, వడ్డెలు ఉదయాన్నే తలంటు స్నానం చేసి సమ్మక్క ఆలయానికి చేరుకుంటారు. తొలుత బూజు దులిపి, అనంతరం నీటితో ఆలయం లోపల, బయట శుభ్రం చేస్తారు. అనంతరం పూజారుల సంబంధీకులైన ఆడపడుచులు ఆలయంలో అలుకుపూతలు నిర్వహించి పసుపు, కుంకుమలతో ముగ్గులు వేస్తారు. ఆలయంలో భద్రపరిచిన అమ్మవారి పూజా సామగ్రి, వస్తువులు, వస్త్రాలను బయటకు తీసి నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం ధూపదీపాలతో తల్లికి పూజలు నిర్వహిస్తారు.

కన్నెపల్లిలో..
మేడారానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ ఆలయంలో సారలమ్మ పూజారులు ఉదయాన్నే స్నానమాచరించి ఆలయానికి చేరుకుంటారు. ఆలయం లోపల, బయట ఉన్న బూజు దులిపి, నీటితో కడిగి శుభ్రం చేస్తారు. అనంతరం కాక వంశం ఆడపడుచులు గుడి లోపల, బయట అలుకుపూతలు వేసి పసుపు, కుంకుమలతో ముగ్గులు వేసి అలంకరిస్తారు. మామిడి తోరణాలు కడతారు. సారలమ్మ వస్త్రాలు, పూజా సామగ్రిని శుద్ధి చేస్తారు. సారలమ్మ వడేరా(కుండలు)లను పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. ధూపదీపాలు వెలిగించి సారలమ్మకు పూజలు చేస్తారు. ఈ గుడిమెలిగె పండుగతో జాతర ఉత్సవాలు ప్రారంభమైనట్లుగా చెప్పవచ్చు.

గ్రాడ్యుయేట్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్ ఓటర్ల దరఖాస్తులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో మండలాల వారీగా పట్టభద్రుల ఓటర్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వివరాలపై సమీక్షించారు. దరఖాస్తులను త్వరగా ఆమోదించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నాటికి 33,993 దరఖాస్తులు రాగా అందులో 33,905 దరఖాస్తులు ఆన్‌లైన్, మరో 88 దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో అందినట్లు వెల్లడించారు. సమావేశంలో ఈఆర్వోలు షేక్ రిజ్వాన్ బాషా, అశ్విని తానాజీ వాకడే, కృష్ణవేణి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఈవీఎంల తనిఖీ పరిశీలన
ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని గోదాముల్లో కొనసాగుతున్న ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్) మొదటి దశ తనిఖీ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను మంగళవారం కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలించారు. ఈసీఐఎల్ ఇంజినీర్లు, అధికారులు, సాంకేతిక నిపుణులతో ఇప్పటి వరకు చేపట్టిన ప్రక్రియను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

తాగునీటి వృథాను అరికట్టాలి



నీటిసరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా

వరంగల్ అర్బన్ : తాగునీటి వృథాను అరికట్టి, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరందించేలా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. చింతగట్టు, హసన్‌పర్తి, జవహర్‌నగర్ బ్రిడ్జి, మారుతి కాలనీ రోడ్డు-6లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చింతగట్టులో నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. ఓ ఇంటి యజమాని రెండు సంవత్సరాలుగా నీటి పన్ను చెల్లించడం లేదని ఆన్‌లైన్‌లో గుర్తించిన కమిషనర్.. పది రోజుల్లోగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో నల్లా కనెక్షన్ కట్ చేస్తామన్నారు. జవహర్‌నగర్ బ్రిడ్జి, రాజాజీనగర్ బ్రిడ్జి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జవహర్‌నగర్ బ్రిడ్జి వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని సీఎంహెచ్ఓ రాజేష్‌ను కమిషనర్ ఆదేశించారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు రాజయ్య, బీఎల్.శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్‌కుమార్, డీఈ రవికుమార్, ఏఈ హరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భీమయ్య, బాషానాయక్ పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన ఉండాలి

నగర మేయర్ గుండు సుధారాణి



సదస్సులో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

రామన్నపేట : జంతు సంరక్షణపై అవగాహన అవసరమని నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం వెంకటేశ్వర గార్డెన్‌లో వీధి, పెంపుడు కుక్కలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కుక్కల దాడులను నియంత్రించడానికి సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్పొరేటర్లు, అధికారులు, ఆర్పీలు, విద్యాశాఖ అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు కార్పొరేషన్ నుంచి ప్రత్యేక యాప్‌ను తయారు చేసినట్లు తెలిపారు. యాప్ ద్వారా రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ పొంది నగరంలోని ప్రభుత్వ స్థలాలకు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తామని, కుక్కలను సంరక్షించడం కోసం ప్రత్యేకంగా కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 66 డివిజన్లలో కుక్కలకు ఆహారం అందించడం, నీటి తొట్టెల ఏర్పాటు చేసేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం కుక్కలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాల్‌పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బల్దియా రూపొందించిన డాగ్ లైసెన్సింగ్, పెట్ రిజిస్ట్రేషన్, పెట్ అడాప్షన్ అప్లికేషన్ యాప్‌ను మేయర్, కమిషనర్ రిజ్వాన్‌బాషా బటన్ నొక్కి ప్రారంభించారు. అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి
వరంగల్ అర్బన్ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మేయర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ పథకం కింద కొనసాగుతున్న భద్రకాళి, వడ్డేపల్లి బండ్ సుందరీకరణ, అభివృద్ధి, అంతర్గత రహదారులు, కల్వర్టులు తదితర పనుల్లో నిర్లక్ష్యం తగదని సూచించారు. సమావేశంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, జీడబ్ల్యూఎంసీ ఈఈ రాజయ్య, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ పార్లమెంట్‌లో బీజేపీదే విజయం

పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంనుంచి బీజేపీ విజయానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ టి.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన వరంగల్ పార్లమెంట్ ప్రవాస యోజన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ప్రభారి వి.మురళీధర్ గౌడ్, హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవి కుమార్, ఏడునూతల నిషిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ విజయ రామారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, రాష్ట్ర అధికార ప్రతినిధులు కీర్తిరెడ్డి, కృష్ణప్రసాద్, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, మొలుగూరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సాగుతున్న బెల్ట్ షాపులపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. జనగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనగామ వీవర్స్ కాలనీలో రంగునాగయ్య బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ.5,140 వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని జనగామ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ముల్కనూర్‌లో పున్నం సుమన్ బెల్ట్ షాపులో రూ.6,920 వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. హసన్‌పర్తిలో ఎస్‌కె కరీం ఇంట్లో రూ.9,890 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెపల్లిలో గుల్లపల్లి రాజు ఇంట్లో రూ. 7,720 విలువ గల మద్యం, దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని కోగిల్వాయిలో నాగుల ఆనందం ఇంట్లో రూ.6,010 వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని నిందితులను సంబంధిత పోలీస్‌లకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. ఇన్‌స్పెక్టర్లు దేవేందర్, పి.రమేష్, అల్లం రాంబాబు, ఎస్సైలు శరత్ నర్సింహరావు, నిస్సార్‌పాషా పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య


మొండయ్య(ఫైల్)

కాళేశ్వరం: అప్పుల బాధతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన పాలిశెట్టి మొండయ్య(46) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొండయ్య మూడెకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో వరిపంటను సాగుచేశాడు. వర్షాకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం (సరస్వతి) బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో గేట్లు ఎత్తిన సమయంలో పంటలోకి నీరు చేరి నష్టపోయాడు. దీంతో పంట పెట్టుబడికి తీసుకొచ్చిన అప్పులు పెరిగి మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో తరుచూ భార్యతో గొడవలు జరిగేవి. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున తన పంటభూమి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. గ్రామస్తులు చూసి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మహదేవపూర్‌కు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అందజేశారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజేశం తెలిపారు.

విద్యార్థులపై కత్తితో దాడి

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచమ్మకుంటలో విద్యార్థులపై కత్తితో దాడి జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం పోచమ్మకుంటలో అద్దెకు ఉంటూ జట్సన్, అరవింద్, సుమంత్ బీటెక్ చదువుతున్నారు. ఈ క్రమంలో వీరి పక్క రూమ్‌లో ఉండే రాకేష్ వద్దకు ఈనెల 4వతేదీన రాత్రి తన సోదరుడు రాజ్‌కుమార్ మద్యం సేవించి వచ్చాడు. మద్యం మత్తులో పక్క రూమ్‌లో ఉండే జట్సన్, అరవింద్, సుమంత్‌తో గొడవకు దిగి కత్తితో దాడికి పాల్పడ్డాడు. దాడిలో అరవింద్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ఘటనపై జట్సన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎదురుచూపులు ఫలించేనా..!

ఏడీఈలకు పదోన్నతులు లభించేనా? రిటైర్మెంట్‌కు దగ్గరగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు

- స్వరాష్ట్రంలోనూ దక్కని అవకాశాలు
- ఏపీ ఉద్యోగులు వెళ్లడంతో ఖాళీగా పోస్టులు
- ఆశల్లో తేలియాడుతున్న ఇంజనీర్లు



హన్మకొండ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులు తమ రాష్ట్రానికి వెళ్లిపోవడంతో పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న టీఎస్‌ఎన్పీడీసీఎల్‌కు చెందిన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లలో(ఏడీఈ) ఆశలు చిగురించాయి. ఏపీకి చెందిన 14 మందిని టీఎస్ ఎన్పీడీసీఎల్ రిలీవ్ చేసింది. దీంతో వీరి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర విభజనతో విద్యుత్ సంస్థలు విడిపోయాయి. ఈ క్రమంలో ఉద్యోగుల విభజన జరిగింది. నిధులు, నియామకాలు, నీళ్లే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమం జరిగింది. అయితే రాష్ట్ర విభజనతో తమకు అవకాశాలు పెరుగుతాయని ఆశించిన విద్యుత్ ఉద్యోగ వర్గాలకు భంగపాటు తప్పలేదు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉద్యోగులను కేటాయించడంతో వీరి అవకాశాలకు కత్తెర పడింది. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులను విధులకు దూరంగా ఉంచడంతో వారు కోర్టుకు వెళ్లారు. వీరితో పాటు తెలంగాణ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించి ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులను అక్కడికే పంపాలని కోరారు. సుప్రీంకోర్టు ధర్మాధికారి కమిటీ ఏర్పాటు చేసి ఉద్యోగుల విభజనపై పూర్తి హక్కులు కల్పించింది. ధర్మాధికారి కమిటీ విచారణ జరిపి ఉద్యోగుల కేటాయింపును పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి 35 మంది ఏడీఈలను ఎన్పీడీసీఎల్‌కు కేటాయించారు. వచ్చిన వారు సీనియర్లు కావడంతో ఎన్పీడీసీఎల్ ఏడీఈలకు నిరాశ మిగిలింది.

20 ఏళ్లుగా ఎదురుచూపులు..

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న ఏడీఈలు 20 ఏళ్లుగా డివిజనల్ ఇంజనీర్ పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. అయినా వారి ఆశలు నెరవేరడం లేదు. రిటైర్మెంట్ సమీపించినా పదోన్నతుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీనియారిటీలో ఉన్న ఏడీఈలకు పదోన్నతులు వస్తాయని ఆశిస్తే గతంలో పదోన్నతులు పొందిన వారికి రివర్షన్ కల్పించి యాజమాన్యం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని వాపోయారు. డివిజన్ ఇంజనీర్లు పదోన్నతులు కల్పించడంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కాలయాపన చేస్తుండడంతో సీనియర్‌లైన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లలో నిరాశనిస్పృహలు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడీఈలు రావడం.. వారు సీనియర్‌లు కావడంతో వారికి పదోన్నతులు కల్పించారు. దీంతో స్థానికత కలిగి ఉండి ఎన్నో ఏళ్లుగా ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న 12 మంది సీనియర్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యోగులు తమకు ఇష్టమైన రాష్ట్రాలను ఎంచుకోవచ్చు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తమకు ఇష్టమైన రాష్ట్రాలను ఎంచుకోవచ్చని కోర్టు సూచించింది. దీంతో టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న 14 మంది అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో ఎస్సీ, ఎస్టీ లైన ఆరుగురు డివిజన్ ఇంజనీర్లు, ఆరుగురు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్లు, ఒక సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను టీఎస్ ఎన్పీడీసీఎల్ రిలీవ్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో గతంలో రివర్షన్ పొందిన వారితో పాటు సీనియర్లలో మళ్లీ ఆశలు రేకెత్తాయి. ఆదిలాబాద్ ఎస్ఈగా పని చేస్తున్న జెడ్.ఉత్తమ్ డీఈగా రివర్షన్ పొందారు. డీఈలుగా పని చేస్తున్న ఉపేందర్, ఇ.వాసుదేవ్‌కు ఏడీఈలుగా రివర్షన్ ఇచ్చారు. సీజీఎం హోదాలో సీజీఆర్‌ఎఫ్‌లో అకౌంట్స్ మెంబర్‌గా పని చేస్తున్న చరణ్‌దాస్‌కు జనరల్ మేనేజర్‌గా రివర్షన్ ఇచ్చారు. వీరితో పాటు మరికొందరు సీనియర్లు పదోన్నతుల కోసం యాజమాన్యం నిర్ణయానికి ఆశగా ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు క్రమంలో స్థానిక ఉద్యోగులకు నష్టం కలుగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించుకోవచ్చని అవకాశం కల్పించిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. అయినా యాజమాన్యం స్థానికత కలిగిన ఏడీఈలకు పదోన్నతులు కల్పించకుండా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలోనూ స్థానికులకు అవకాశాలు దక్కకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ స్టేట్ సదరన్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి అక్కడి ఇంజనీర్‌లకు న్యాయం చేశారని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు చెప్పారు. కాగా, తాము రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నామని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి తమకు డివిజనల్ ఇంజనీర్‌గా రిటైర్డయ్యే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

ప్రజల అభీష్టం మేరకే బాలక్‌రామ్ ప్రతిష్ఠాపన

- తెలంగాణలో 10 లోకసభ సీట్లు గెలుస్తాం..
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే

వరంగల్: రాముడు అందరి వాడని, ప్రజల అభీష్టం మేరకే అయోధ్యలో బాలక్‌రామ్ ప్రతిష్ఠాపన జరిగిందని అయోధ్య బాల రాముడి దర్శన్ అభియాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాముడిపై బీజేపీ రాజకీయాలు చేస్తున్నదని అవగాహన లేని వాళ్లు చేస్తున్న ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అయోధ్య రామాలయం దేశ ప్రజలందరికీ చెందుతుందన్నారు. హిందుత్వాన్ని, సనాతన ధర్మాన్ని వ్యతిరేకించడమే కాంగ్రెస్ నైజమని ఆరోపించారు. తెలంగాణలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 10ఎంపీ సీట్లుకైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. మోదీ దేశ రక్షణ కోసం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి గంట రవికుమార్ భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, వన్నాల వెంకటరమణ, గడల కుమార్, పొట్టి శ్రీనివాస్‌గుప్తా, బండి సాంబయ్యయాదవ్, మల్లాడి తిరుపతిరెడ్డి, బన్న ప్రభాకర్, పదాధికారులు పాల్గొన్నారు.

పింగిళి మహిళా డిగ్రీ కళాశాల సెమిస్టర్ల ఫలితాల విడుదల

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలల (అటానమస్) డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, రెండో సంవత్సరం మూడో సెమిస్టర్, మూడో సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి విడుదల చేశారు. డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలో 523మందికిగాను 300 మంది విద్యార్థినులు 57.3శాతం ఉత్తీర్ణత సాధించారు. మూడో సెమిస్టర్‌పరీక్షలో 458మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందులో 277మంది 60.4శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐదో సెమిస్టర్ పరీక్షలకు 419 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందులో 330మంది విద్యార్థినులు 78.70శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు రేణుక, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని పాల్గొన్నారు.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది

- కేయూ వీసీ తాటికొండ రమేష్


మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. కేయూ తెలుగు విభాగం, పీవీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆచార్య బన్న ఐలయ్య అధ్యక్షతన యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో మంగళవారం కేయూ మాజీ పాలకమండలి సభ్యుడు ముప్పాశ్రీనివాస్‌రావు రచించిన 'అనితరుడు' కవితాంత రంగ విశ్లేషణల పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా నిర్వహించిన సభలో వీసీ మాట్లాడారు. విద్య సబ్జెక్ట్, వృత్తికి సాహిత్యానికి సంబంధం లేదన్నారు. వ్యవస్థను మార్చే శక్తి మహిళకు ఉంటుందన్నారు.విద్యార్థులు ర్యాంకులతోపాటు సమాజాన్ని సరైన కోణంలో అర్థం చేసుకోవాలన్నారు. అప్పుడే విద్యార్థి ఆత్మహత్యలవంటి సామాజిక రుగ్మతల నుంచి బయట పడుతామన్నారు. సాహిత్యం ఆకళింపు చేసుకుంటే విమర్శ సులభమవుతుందన్నారు. ముప్పా శ్రీనివాస్‌రావు సాహిత్యంలో ఎన్నోకోణాలు ఉన్నాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్యనవీన్‌మాట్లాడుతూ మూసధోరణులు కాకుండా కవిత్వంలో నూతనత్వం, వైవిధ్యం ఉండాలన్నారు. సాహిత్యకారుల ఆలోచన పరిధి విస్తృతమైందన్నారు. పుస్తక సమీక్ష చేసిన డాక్టర్‌వాసిరెడ్డి కృష్ణారావు మాట్లాడుతూ కవి ఎప్పుడూ ఆలోచనలలో ముందు ఉంటాడన్నారు. తెలుగు సాహిత్యం గొప్పదన్నారు. సాహిత్యరచనలకు వయసు అడ్డు కాదని అభ్యుదయ కవులు గుర్తుంచుకోవాలన్నారు. మరో గ్రంథ సమీక్షకుడు డాక్టర్ భండార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కవికి ఊహాశక్తి ఉండాలన్నారు. కార్యక్రమంలో కవి, రచయితలు గిరిజామనోహర్‌బాబు, వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, బిల్లమహేందర్, కె వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైలు ప్రారంభం


రైలును ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో మంగళవారం కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైలును బీజేపీ ఎమ్మెల్యేలు ప్రారంభించారు. రైల్వేశాఖ ప్రవేశపెట్టిన కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైలుకు ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 1,346 మంది రిజర్వేషన్ చేసుకోగా అందులో 1,226 మంది కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. మిగతా120 మంది రాలేదు. కాజీపేట జంక్షన్ ఎదుట రైల్వే అధికారులు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ అడిషనల్ రైల్వే మేనేజర్ గోపాల్, సీనియర్ డివిజన్ ముఖ్యవాణిజ్య మేనేజర్ బస్వరాజు, ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబస్మిత బెనర్జీ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్‌కుమార్, అదనపు కమర్షియల్ మేనేజర్ బిఎస్ఆర్.మూర్తి, కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ సీఐ రామ్మూర్తితో పాటు రైల్వే వివిధ విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ప్రయాణికులకు స్వాగతం పలికి రిజర్వేషన్ చేసుకున్న వారికి ట్యాగ్‌తో కూడిన ఐడీ కార్డులు జారీ చేసి రైలు వద్దకు పంపించారు. బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, ఎం. ధర్మారావు, విజయరామారావు, కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమేందర్‌రెడ్డి ప్రత్యేక రైలును ప్రారంభించారు. సాయంత్రం 6. 20 గంటలకు రైలు అయోధ్యకు బయలుదేరింది.

నలుగురికి అనుమతి నిరాకరణ

సమయానికి చేరుకున్నా తమను తీసుకెళ్లేవారు టికెట్ ఇవ్వకపోవడంతో అయోధ్య రైలులో తమను అనుమతించలేదని హనుమకొండకు చెందిన సత్యనారాయణ, వెంకట్రామిరెడ్డి, వాసంతి, ప్రభావతి.. విలేకరుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆశతో అయోధ్యకు వెళ్లాలని వచ్చిన తమను పట్టించుకోకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

వరకట్న వేధింపులతోనే మహిళ ఆత్మహత్య

- ఏడుగురి అరెస్టు.. రిమాండ్ తరలింపు
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ కిషన్

ఖిలా వరంగల్ : అదనపు కట్నం రూ.26వేల కోసం వేధింపులకు గురిచేయగా మనస్తాపం చెందిన ఓ మహిళ.. తన 7నెలల కుమారుడితో కలిసి పర్వతగిరి మండలం అన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో పోలీసులు మంగళవారం ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వరంగల్ ఏసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏసీపీ బోనాల కిషన్ కేసు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్.కె అఫ్జల్‌కు ఒక కుమారుడు, కుమార్తె తస్లీమ్(23) ఉన్నారు. 19 నెలల క్రితం తస్లీమ్‌ను వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండి. మహమూద్ రెండో కుమారుడు తన్వీర్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ సమయంలో రూ.1.50 లక్షల నగదు. 3 తులాల బంగారం, 26 తులాల వెండి, బైక్ కోసం షాదీముబారక్ పథకంలో భాగంగా ప్రభుత్వం అందజేసిన రూ.లక్ష నగదు తన్వీర్‌కు అందజేశారు. అయితే బైక్ కొనుగోలుకు రూ. లక్ష సరిపోవని, ఇంకా రూ.26వేలు ఇవ్వాలని, అదన కట్నం తీసుకు రావాలని వివాహం జరిగిన ప్పటి నుంచి తస్లీమ్‌ను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో కుటుంబీకులు, భర్త వేధింపుల భరించలేక మనోవేదనకు గురైన తస్లీమ్ తన కుమారుడు తైమూర్‌ను తీసుకుని ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ దర్గాకు చేరుకుంది. కుమారుడితో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చెరువు నుంచి మృతదేహాలను వెలికితీసి మృతురాలి తండ్రి అఫ్జల్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ ఘటనపై శంభునిపేటకు చెందిన మృతురాలి పెద్దమ్మ ఫాతిమా, మృతురాలి తండ్రి అఫ్జల్ ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త తన్వీర్, అత్త అఫ్జల్‌బీ, మామ మహిమూద్, ఆడబిడ్డ తస్లీమ్, బావ ఫారూఖ్, తోటికోడలు షాజహ, ఆడబిడ్డ భర్త జాఫర్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఏసీపీ తెలిపారు. మిల్స్‌కాలనీ సీఐ సురేష్ గౌడ్, ఎస్సైలు వెంకన్న, రాజు, మున్నూర్ ఉల్లా పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న భారత జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, చిత్రంలో గట్టు రాంచందర్‌రావు, వి.ప్రకాశ్, సారయ్య తదితరులు

- బీసీ గణన జరిగే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు జరపొద్దు
- భారత జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హన్మకొండ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించినట్లుగానే బీసీల హక్కుల సాధనకు బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. యునైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతి ఆధ్వర్యంలో బీసీ హక్కుల సాధనకు రౌండు టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో కవిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యునైటెడ్ పూలే ఫ్రంట్ బీసీల హక్కుల కోసం సాధనకు ఏర్పడిందన్నారు. వరంగల్ అంటే ఉద్యమాలకు పెట్టింది పేరని, రాణిరుద్రమదేవి, సర్దార్ సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తెలంగాణ కోసం పోరాడమన్నారు. మరోసారి అదే స్ఫూర్తిని ప్రదర్శించాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాష్ట్రంలో బీసీ జన గణన జరిపిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. ఆరు నెలల్లో బీసీ జనగణన పూర్తి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణకు పూనుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీ మేరకు జనగణన కార్యక్రమాన్ని చేపట్టి ఆరు నెలల్లో పూర్తి చేసి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేస్తామని చెప్పిన మాట నిలుపుకోవాలన్నారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు రాంచందర్ రావు మాట్లాడుతూ ఏప్రిల్ 11లోపు అసెంబ్లీలో విగ్రహం పెట్టకపోతే ప్రభుత్వం అంతుచూస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ ఇందిరా పార్కులో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో ఈ నెల 12న నిర్వహించనున్న మహాధర్నాకు బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జలవనరుల మండలి మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, కుడా మాజీ చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు బక్క నాగరాజు, మోటె చిరంజీవి, గంగాపురం వేణుమాధవ్, వెంకట్రాజం, బయ్య స్వామి, పి. రజనీకాంత్, టి.జనార్దన్ గౌడ్, మోహన్, రాధకృష్ణ, కొండయ్య, రాంబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా సంక్షేమ అధికారి మధురిమ


మాట్లాడుతున్న మధురిమ

హన్మకొండ : అవగాహన కల్పించడం ద్వారా బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయొచ్చని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆసుంత భవన్‌లో బాల్య వివాహాల నిర్మూలన, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక హింస, వేధింపులు, నివారణ అంశంపై హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక లేమి కారణాలతో తల్లిదండ్రులు తమ పిల్లలకు పెళ్లిళ్లు చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడొద్దన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, బాలల పరిరక్షణ కమిటీలు పర్యవేక్షణ చేస్తూ సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. పిల్లలకు విద్యను ఆయుధంగా అందించి ఉజ్వల భవిష్యత్తు అందించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ పిల్లలు సామాజిక మాధ్యమాల ప్రభావాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ పి.సంతోష్ కుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఎస్.భాస్కర్, సోషల్ వర్కర్ మెరుగు శ్రీనివాసులు, జిల్లా మహిళా సాధికార కేంద్రం లిట్రసీ కోఆర్డినేటర్ స్వర్ణలత, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రోగ్రాం అధికారి ఎర్ర శ్రీకాంత్, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీతంపై అవగాహన కల్పించాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


కీర్తనలు ఆలపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ కల్చరల్ : భావితరాలకు శాస్త్రీయ సంగీత విద్య ఆవశ్యత తెలియజేసి, అభ్యసించేలా అవగాహన కల్పించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం ఉదయం పోతనవిజ్ఞాన పీఠం ఆడిటోరియంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సద్గురు శ్రీత్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ నాగ్లొడ సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య, ఆత్మీయ అతిథిగా ఆగమసామ్రాట్ భద్రకాళి శేషు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి శ్రీత్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల గోష్ఠిలో పాల్గొని కీర్తనలను ఆలపించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ గతంలో ఏ సంగీత కార్యక్రమాల్లో కూడా ఐఏఎస్ స్థాయి అధికారి సంగీత గోష్ఠిలో పాల్గొనలేదని, వరంగల్ కలెక్టర్ పాల్గొని కీర్తనలు ఆలపించడం ఇదే మొదటిసారి అని ప్రశంసించారు. అలాగే, పండిత్ శ్రీవిష్ణు నారాయణ్ భాత్ఖండే, పండిత్ శ్రీ విష్ణు దిగంబర్ పలుస్కర్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 12గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసుడు నాసా గోపినాథ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులతో సంగీత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ గుమ్మడి జనార్దన్, సిబ్బంది అనుముల యోష, ఏడిద భీమశంకర్, సింగారపు భాస్కర్, ప్రొఫెసర్ తిరుపతయ్య, హరి విజయశ్రీ, లాయక్ అహ్మద్, కుంట రాజు, ఉమ్మడి లక్ష్మణాచారి, చాతరాజు నవ్యజ, గడ్డం శంకర్, ప్రవళ్లిక, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో అభిరామ్..


అభిరామ్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్న విద్యార్థులు


అభిరామ్ తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న విద్యార్థులు

పేద విద్యార్థికి బ్రెయిన్ ట్యూమర్

- వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు అవసరం
- రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచిన ప్రభుత్వ పాఠశాల
- విద్యార్థి చికిత్సకు దాతలు స్పందించాలని ఉపాధ్యాయ బృందం విజ్ఞప్తి

కాజీపేట రూరల్: ఓ పేద విద్యార్థికి అనారోగ్య సమస్య తలెత్తింది. వైద్య ఖర్చులకు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. అంత ఖర్చు భరించలేని పేద కుటుంబానికి ప్రభుత్వ పాఠశాల అండగా నిలిచింది. ఆపదలో తమంతా అండగా ఉంటామని ముందుకొచ్చి కొన్ని నిధులు సేకరించి అందజేసి హాట్సాఫ్ అనిపించుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టకు చెందిన లాదెల్ల రాజు, ఊర్మిల దంపతులు కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు అభిరామ్ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి స్కూల్‌కు వెళ్లడం లేదు. దీంతో స్కూల్ హెడ్‌మాస్టర్ కె.రఘోత్తంరెడ్డి, ఉపాధ్యాయుడు బి.కిరణ్‌రెడ్డి.. తల్లిదండ్రులు ఊర్మిల, రాజును పిలుపించి వివరణ కోరారు. అభిరామ్ అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో అడ్మిట్ కాగా బ్రెయిన్ ట్యూమర్ అని వైద్యులు తెలిపి, ఆపరేషన్ చేయాలని తెలుపగా హైదరాబాద్ నిమ్స్‌లో అడ్మిట్ చేసినట్లు తెలిపారు. చికిత్సకు రూ.5 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పినట్లు వివరించి కన్నీరుమున్నీరయ్యారు. దీనికి స్కూల్ హెడ్‌మాస్టర్ రఘోత్తమ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌రెడ్డి చలించారు.తమతోపాటు బంధువులు, స్నేహితుల సహకారంతో రూ.80వేలు సేకరించి మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే, సహ విద్యార్థులు రూ.500 సాయం చేశారు. ఇతరులు దండ స్ఫూర్తి, సుప్రియ రూ.9వేలు, నాగిల్ల స్వరూపరాణి రూ.5వేలు, పాముల పర్తి కుమార్ రూ.5000, స్పందన రూ.3వేలు, చింటు, రవీందర్‌రెడ్డి రూ.2వేలు అందజేశారు. అలాగే, కిరణ్‌రెడ్డి, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు, సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులు, హిల్స్ కాలనీ సభ్యులు, డైట్ స్నేహితులు, చిన్ననాటి స్నేహితులు.. విద్యార్థికి ఆర్థిక సాయం చేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం రఘోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి అభిరామ్ త్వరగా కోలుకుని చదువుకోవాలని ఆకాంక్షించారు. దాతలు సహృదయంతో ముందుకు వచ్చి అభిరామ్‌కు తోచిన సాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎండి.అఫ్జల్, దొంగల వేణు, రాజేశ్వరీ, దొంగల కుమార్ పాల్గొన్నారు.